క్లుప్తంగా

ఘనంగా ముగిసిన ఆరాధన ఉత్సవాలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో శనివారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీసమర్థ రామదాస స్వామి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి గోపాల స్వామి, ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర స్వామి, భక్తులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

చాపాడు : ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసుకోవాలని ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి పేర్కొన్నారు. మండల పరిధిలోని మడూరు గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ.. పొడి చెత్తను సంచిలో వేసుకోవాలని, తడి చెత్తను ప్లాస్టిక్ బుట్టలో ఉంచాలన్నారు. గ్రీన్ అంబాసీడర్‌లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు చెత్తను అందజేసి సహకరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి తెలిపారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో శనివారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో గౌతమి హైస్కూల్ వ్యవస్థాపకుడు టి.నారాయణస్వామి నాయుడు జ్ఞాపకార్థం కరస్పాండెంట్ సుధీర్ నాయుడు సహకారంతో 220 మంది పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సుశీల, ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్, కార్యదర్శి రాజు, దివిజేంద్రనాథ్, లక్ష్మణ్, నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో గత కొన్నేళ్ళుగా నెలకొన్న మురుగు నీటి సమస్యకు వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపుతామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం డిపో మేనేజర్ నిరంజన్‌తో కలిసి బస్టాండు వెనుక భాగంలోని పారిశుద్ధ్య సమస్యను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు వెనుక భాగంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు నిలుస్తోందని గుర్తించడం జరిగిందని, తక్షణమే మురుగునీరు పారేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

గోపవరం : పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద గోపవరం, చిన్న గోపవరం, దళితవాడలలో పంచాయతీ కార్యదర్శి విజయ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్‌లు అందజేశారు. తడి, పొడి చెత్త వేరువేరుగా వేసి ఇంటి వద్దకు వచ్చిన గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ట్రైనీ డీఎస్పీగా భవానీ



చాపాడు : చాపాడు పోలీసుస్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీగా భవానీ శనివారం బాధ్యతలు చేపట్టినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మూడు వారాల పాటు డీఎస్పీ భవానీ ట్రైనీ డీఎస్పీగా విధులు నిర్వహించనున్నారు. గతేడాది గ్రూప్-1 పరీక్షలలో డీఎస్పీగా భవానీ ఎంపికయ్యారు. ఇటీవల ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించి, చాపాడు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఎర్రగుంట్ల మండలం ఆర్టీపీపీకి చెందిన భవానీ చాపాడు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు.

సత్యానందరెడ్డికి మొల్ల సాహితీసేవ పురస్కారం

గోపవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యానందరెడ్డికి శనివారం మొల్ల సాహితీసేవ పురస్కారాన్ని అందజేశారు. తెలుగు సాహితీ యాత్రలు, మొల్ల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యానందరెడ్డి పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి, విద్యార్థుల్లో ఉన్నత ప్రమాణాలు పెంచే దిశగా కృషి చేస్తున్నందుకు ఈ పురస్కారం అందజేస్తున్నట్లు మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంటహనుమంతరావు తెలిపారు.

వైభవంగా పెద్దమ్మతల్లి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పెద్దమ్మతల్లి



కార్యక్రమంలో పాల్గొన్న భక్తజనం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కానపల్లె గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలకు వేదపారాయణం, వాస్తు పూజ, వాస్తు హోమం, గ్రామ ప్రదక్షణ, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఊరేగించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటాల మధ్యలో గ్రామోత్సవం కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయకర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త గుమ్మళ్ల లత, ఉమామమేశ్వర రెడ్డి, గ్రామ పెద్దలు గంజికుంట రాజారెడ్డి, గంజికుంట సంజీవరెడ్డి, గుమ్మళ్ల నారాయణరెడ్డి, గుమ్మళ్ల దేవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు

పెద్దమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చల్లా బువ్వ కార్యక్రమం, పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుమ్మళ్ల ఉమామమేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రాయలసీమకు నిధులు కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన రాయలసీమకు నిధులు కేటాయించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడంతోపాటు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంతోపాటు రాయలసీమలోని ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించకుండా ఇక్కడే కొనసాగించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రకటించిన 2019లో ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసిన గుండ్రేవుల రిజర్వాయర్‌ను వెంటనే నిర్మించాలన్నారు. రాయలసీమలో ఏపీ సీడ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. శ్రీశైలం జలాశయంలో పూడికను నివారించుటకు, రాయలసీమ జిల్లాలకు కేటాయించిన కృష్ణా జలాలను సరైన కాలంలో రైతులకు అందించుటకు సిద్దేశ్వరం అలుగు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, ఆర్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీదేవి, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఏపీడీఎస్ ప్రతినిధి యల్లయ్య మాదిగ, రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి మహమూద్, రాయలసీమ విద్యార్థి శక్తి జిల్లా కార్యదర్శి హరిత, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆయా పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేములరమణమ్మ అధికారులను కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో గుర్తించి అందుకు తగ్గట్లు చర్యలు తీసుకుని ఎక్కడా కూడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. మండల పరిధిలోని ఆయా హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని, అలాగే లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతి పత్రం అందించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని, ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కరోనా కార్మికులందరికీ రూ.3 వేల జీతం పెంచి రెన్యూవల్ చేయాలని తెలిపారు. నగర దీపికలను యథావిధిగా కొనసాగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ త్వరగా ఇవ్వాలని, మార్కెట్‌లో పని చేస్తున్న ముగ్గురు కార్మికులకు 11 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని, వారికి వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరారు. క్యాబ్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంటి, రవికుమార్, సాలమోన్, రాఘవేంద్ర, ప్రమీల, గుర్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : నరసాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఏప్రిల్ 27న ఫలితాలు వెలువడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భద్రకాళి అమ్మవారికి తాళిబొట్టు బహూకరణ

చాపాడు : ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం సాయంత్రం భద్రకాళి అమ్మవారికి పులివెందులకు చెందిన పుణ్య దంపతులు 12.3 గ్రాముల బంగారు తాళిబొట్టు అందజేశారు. రామ్‌కో సిమెంట్‌లో పని చేస్తున్న రెడ్డి నాగరాజు సతీమణి స్వర్ణ కుమారి తాళిబొట్టును ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, అర్చకులు భరత్‌కుమార్ శర్మలకు అందజేశారు. స్వామి వారిపై భక్తి భావంతో తాళిబొట్టును అందజేసినట్లు వారు తెలిపారు.

జాబ్‌మేళాలో 33 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 33 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్డీఏ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో మొత్తం 83 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ, బెల్‌స్టార్ మైక్రోఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఇలాంటి జాబ్ మేళాలను ప్రతి నెల నిర్వహిస్తుంటామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ప్లేస్‌మెంట్ అధికారి పృథ్వీరాజ్, ఎల్ఐసీ సంస్థ అధికారి అశోక్ కుమార్, ఎస్‌బీఐ అధికారి వెంకటనారాయణ, స్టార్ మైక్రోఫైనాన్స్ చిన్నప్ప, సీడాప్ జేసీఓ రామకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ చంద్ర, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం తీర్మానం చేయాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని, ఇందుకోసం పాలకవర్గ సమావేశంలో ఉద్యోగ భద్రత కోసం తీర్మానం చేసి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ సాయిక్రిష్ణలతో పాటు వార్డు కౌన్సిలర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ ఆప్కాస్ సంస్థ ఏర్పాటు కాక ముందు దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీతభత్యాల చెల్లింపులు సైతం దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని అన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆప్కాస్ వ్యవస్థ వీటన్నింటికి స్వస్తిపలికి కార్మికులకు సకాలంలో జీతాలు అందించేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయనున్నట్లు ప్రకటించడం ద్వారా పొరుగు సేవల కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, సహాయ కార్యదర్శి సత్యరాజు, కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి



ఉయ్యాలవాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు



నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాగార్జునరెడ్డి

ప్రొద్దుటూరు : రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆయన విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 1847లో బ్రిటిష్ దుర్మార్గపు పాలనను ఎదిరించి పోరాడిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి భారతీయుడు మహనీయుల చరిత్రను తెలుసుకుని ముందు తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఉపాధ్యక్షుడు టంగుటూరు మారుతిప్రసాద్, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి, రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు పద్మవీరన్న, యడవల్లి రమణయ్య, రామాంజనేయరెడ్డి, దస్తగిరి, డాక్టర్ పగిడేల నరసింహారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : సిపాయిల తిరుగుబాటుకు ముందే రాయలసీమలో స్వాతంత్ర్య పోరాటం నడిపిన యోధుడు ఉయ్యాల నరసింహారెడ్డి అంటూ ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వ పంచాయతీరాజ్ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178 వ వర్ధంతి సందర్భంగా స్థానిక కృష్ణ శారద డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ 1806 నవంబర్ 24న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ రూపనగుడి ఉయ్యాలవాడలో మల్లారెడ్డి, సీతమ్మ దంపతులకు నరసింహారెడ్డి జన్మించాడన్నారు. బ్రిటీష్ అరాచకాలను ఎదుర్కొనేందుకు 5 వేల మందితో ఓ సైన్యం తయారు చేసి పోరాటం చేశాడన్నారు. ఆయన చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు, ప్రతి మండల కేంద్రంల్లో కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. 1847 ఫిబ్రవరి 22న నరసింహారెడ్డిని జుర్రేటి వాగు వద్ద ఉరి తీసి ఆయన తలను కోట గోడకు వేలాడదీశారని నాగార్జునరెడ్డి తెలిపారు. బ్రిటీష్ మూకల చిత్ర హింసలకు బెదురు భయం లేకుండా ప్రాణ త్యాగం చేసిన నరసింహారెడ్డిని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎస్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇవ్వాల్సిన పెద్ద ఆస్తి చదివే



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు : తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సిన పెద్ద ఆస్తి చదివేనని టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. స్థానిక శ్రీనివాసనగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల, తెలుగు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాలను శనివారం 14వ వార్డు కౌన్సిలర్ జిలాని బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవ వేడుకలను కౌన్సిలర్ జిలాని బాషా ముందుకు వచ్చి నిర్వహించడం అభినందనీయమన్నారు. కుటుంబంలో ఒకరు విద్యావంతులైతే ఆ కుటుంబ స్థితిగతులు మారుతాయన్నారు. ఎంఈఓ-2 శోభారాణి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పాఠశాలలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సినీ నటుడు దావూద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ మన్నె సత్యం, ప్రధానోపాధ్యాయులు ఇమాంహుస్సేన్, జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వరరావు

ప్రొద్దుటూరు క్రైం : ఆర్ఎంపీలు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. రిజిస్టర్ చేసుకున్న గైనకాలజిస్ట్ మాత్రమే అబార్షన్ చేయాలని, ఆడ పిల్ల అని తెలిసి అబార్షన్ చేసిన వారికి, ప్రోత్సహించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు పెట్టుకోవాలని, ఆస్పత్రి, క్లినిక్ అని పెట్టుకోరాదన్నారు. వారి పేరు ముందు డాక్టర్ అని రాయకూడదని, ప్రథమ చికిత్స మాత్రమే చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలన్నారు. ఎవరైనా పరిధి దాటి వైద్యం చేస్తే ప్రభుత్వ నియమాల ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్స్ వెంకటేశ్వర్లు, మరియకుమారి, లీగల్ కన్సల్టెంట్ పాలేశ్వరరావు, ఆర్ఎంపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సెక్రటరీ శివకుమార్, జమ్మలమడుగు డివిజన్ అధ్యక్షుడు నౌషద్, సెక్రటరీ గంగయ్య పాల్గొన్నారు.

హెల్త్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను విజయవంతం చేయండి



విద్యార్థినిని పరీక్షిస్తున్న ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై నిర్వహించే హెల్త్ స్క్రీనింగ్ స్పెషల్ డ్రైవ్‌ను, ఎన్‌సీడీ 3.0 సర్వేను, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ భగత్ సింగ్ కాలనీలో శనివారం హెల్త్ స్క్రీనింగ్ స్పెషల్ డ్రైవ్‌ను, ఎన్‌సీడీ 3.0 సర్వేను, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రజలు పరీక్షలు చేయించుకుని క్యాన్సర్, టీబీ లాంటి జబ్బులు ఉంటే చికిత్స పొంది ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ కృష్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ వరప్రసాద్, బేబి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస్ పరీక్షలు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 25న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజ్ఞా వికాస్ పరీక్షలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. శనివారం ప్రజ్ఞా వికాస్ పరీక్షల కరపత్రాలను ఎంఈఓ సావిత్రమ్మ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పదో తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నపత్రాలను రూపొందిస్తారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ మోడల్ పరీక్షల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులు తమ, స్కూల్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ - 8297762173, డీఐఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ - 8008087023 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరికుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు జయంత్ పాల్గొన్నారు.